నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
22 మే 2024
పేజీలు 8

### శాంతి స్మారక స్థూపం

కొహిమా శాంతి స్మారక స్థూపం నిర్మాణానికి నాగాలాండ్ ముఖ్యమంత్రి, అలాగే భారత్‌కు జపాన్ రాయబారి హిరోషి సుజుకి శంకుస్థాపన చేశారు. ఎకో పార్కును కూడా ఇక్కడ నిర్మించనున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో భాగంగా ఇంఫాల్ యుద్ధం, కొహిమా యుద్ధంలో మరణించిన వారి స్మారకార్థం దీన్ని నిర్మిస్తున్నారు.

## జాతీయం

### ఆపరేషన్ మర్యాద



- కేదార్‌నాథ్ యాత్రలో ఎలాంటి దాడులు జరగకుండా ఉండేందుకు పోలీసులు 'ఆపరేషన్ మర్యాద'ను చేపట్టారు. అలాగే భక్తులు కూడా ఈ ప్రాంత పవిత్రతను కాపాడేలా వ్యవహరించేలా పోలీసులు తగిన సూచనలు, సలహాలు ఇస్తారు. వీటిని ఉల్లంఘిస్తే చలానాలు విధిస్తారు.

### తగ్గుతున్న మెజారిటీ జనాభా

- భారత్‌లో మెజారిటీగా ఉన్న హిందువుల జనాభా 7.82% తగ్గిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి పేర్కొంది. 1950 నుంచి 2015 నాటికి ఉన్న గణాంకాలను పరిశీలించి వివిధ అంశాలను ఈ మండలి వెల్లడించింది. ఇందులో ప్రధానంగా పరిశీలిస్తే..
- 1950లో దేశ జనాభాలో 84.68% ఉన్న హిందువులు 2015 నాటికి 78.06% మాత్రమే ఉన్నారు.
- ఇదే కాలంలో జైనులు, పార్శీల జనాభా కూడా తగ్గింది.
- బౌద్ధులు, సిక్కులు, క్రైస్తవులు, ముస్లిముల జనాభా పెరిగింది.

### తగ్గిన పట్టణ నిరుద్యోగం

- 2024, జనవరి-మార్చి మధ్య పట్టణ నిరుద్యోగిత 6.7 శాతం తగ్గిందని జాతీయ నమూనా సర్వే కార్యాలయం నిర్వహించిన 22వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో వెల్లడయ్యింది. 15 సంవత్సరాల వయస్సు మించిన వారి ఉద్యోగాలకు సంబంధించి దీన్ని చేపట్టారు. పని-జనాభా నిష్పత్తి, లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ తదితరాలను పరిశీలించి ఈ సూచీని తయారు చేశారు.

### టీసీఎస్

- భారత్‌కు చెందిన టాటా కన్సల్టెన్సీ సంస్థ గ్లోబల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఏర్పాటు చేసింది.

### సారే జహాసే అచ్ఛా

- 'ఆసియా అమెరికన్, నేటివ్ హవాయి, పసిఫిక్ దీవి' అనే కూటమి అమెరికాలోని వైట్‌హౌస్‌లో ఒక సంగీత కార్యక్రమాన్ని నిర్వహించాయి. భారతీయ అమెరికన్ల సేవలకు గుర్తుగా ఈ వేడుక జరిగింది. ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు హారిస్ దీన్ని నిర్వహించారు. ఇందులో సారే జహాసే అచ్ఛా పాట సంగీతాన్ని వినిపించారు.

### సెలా టన్నెల్




- బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ సెలా టన్నెల్‌ను అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్మించింది. ఇది ప్రపంచంలోనే అతి పొడవైన బైలెన్ టన్నెల్. 13,000 అడుగుల ఎత్తులో ఉంది. తేజ్‌పూర్-తవాంగ్ రోడ్‌లను కలుపుతుంది. తాజాగా ఇది మరో ఘనతను దక్కించుకుంది. భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన సొరంగ మార్గంగా ఇంగ్లండ్‌కు చెందిన 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ హానర్' దీన్ని గుర్తించింది.

## అంతర్జాతీయం

### ఐక్యరాజ్య సమితి

- ఏటా మే 25న ప్రపంచ ఫుట్‌బాల్ రోజుగా నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి సర్వసభ్య ప్రతినిధి సభ ప్రకటించింది. ప్రపంచంలో ఇది అత్యంత ప్రజాదరణ ఉన్న క్రీడ. సాధారణ సభ 80వ ప్లీనరీ సమావేశంలో ఈ తీర్మానాన్ని ప్రతిపాదించగా ఆమోదం లభించింది. 1924లో ఒలింపిక్స్‌ను పారిస్‌లో నిర్వహించారు. ఇందులో అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొన్నాయి. 2024లో కూడా ఒలింపిక్స్ పారిస్‌లో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మే 25న ఫుట్‌బాల్ నిర్వహించాలని నిర్ణయించారు.

### కార్బన్ డై ఆక్సైడ్ మమ్మోత్



- కార్బన్-డై-ఆక్సైడ్‌ను నిల్వ చేసుకొనే అతి పెద్ద వ్యవస్థను మమ్మోత్ పేరుతో ఐస్‌లాండ్ దేశంలో అందుబాటులోకి తెచ్చారు. దీన్ని క్లైమ్ వర్క్స్ అనే సంస్థ అభివృద్ధి చేసింది. ఇదే సంస్థ 2021లో ఒర్కా అనే పేరుతో ఒక వ్యవస్థను నిర్మించింది. తాజాగా నిర్మించిన మమ్మోత్ అంతకంటే పదిరెట్లు పెద్దది.

### పాలస్తీనాకు భారత్ మద్దతు

- ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాకు పూర్తి స్థాయి సభ్యత్వం ఇవ్వాలన్న అంశంతో ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత్ మద్దతు ఇచ్చింది. ఒక కొత్త దేశానికి సభ్యత్వం ఇవ్వాలంటే భద్రతా మండలిలో 9 దేశాలు అంగీకరించాలి. శాశ్వత సభ్యత్వం ఉన్న ఏ దేశం కూడా వీటో చేయరాదు. ఈ తీర్మానానికి ఇటీవల అమెరికా వీటో చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని, పాలస్తీనాకు సభ్యత్వం కల్పించాలని సాధారణ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీన్ని భారత్ సమర్థించింది.

### ఉగ్రవాద వ్యతిరేక నిధి

- ఉగ్రవాద వ్యతిరేక నిధికి భారత్ 5 లక్షల అమెరికన్ డాలర్లను అందించింది. ఈ నిధిని 2017లో ఏర్పాటు చేశారు.

### అడవులపై ఐరాస కార్యాలయం

- అన్ని రకాల అడవుల నిర్వహణ, పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి అడవుల ఫోరం మే 6 నుంచి 10 వరకు సమావేశాన్ని న్యూయార్క్‌లో నిర్వహించింది. రాజకీయ, పరిపాలనాపరమైన నిర్ణయాల ద్వారా అడవుల పరిరక్షణ చేపట్టాలని ఇందులో నిర్ణయించారు.

### యునెస్కో

- సాహిత్య కళాఖండాల జాబితాలో రామచరితమానస్, పంచతంత్ర, సహ్రుదయలోక్-లోకన్ అనే మూడు రచనలను యునెస్కో చేర్చింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి ఉద్దేశించిన పట్టికలో భారత్‌కు చెందిన ఈ మూడింటికి చోటు దక్కింది. రామచరితమానస్‌ను తులసీదాస్ రచించారు. పంచతంత్రను విష్ణుశర్మ, సహ్రుదయలోక్-లోకన్‌ను ఆచార్య ఆనందవర్ధన్ రాశారు. ఈ పట్టికను 1997లో యునెస్కో ప్రవేశపెట్టింది. సాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే రచనలను ఇందులో చేరుస్తుంది.

### ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్

- రెమిటెన్స్‌లు, వలసలకు సంబంధించి ఈ సంస్థ పలు అంశాలను వెల్లడించింది. రెమిటెన్స్‌లలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంది. 2022లో భారత్‌కు 111 బిలియన్ డాలర్లు రెమిటెన్స్ రూపంలో వచ్చాయి. 100 బిలియన్ డాలర్లు దాటిన తొలి దేశంగా భారత్ ఘనతను దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా మెక్సికో, చైనా, ఫిలిప్పీన్స్, ఫ్రాన్స్ నిలిచాయి. వలసలకు సంబంధించి కూడా కొన్ని అంశాలను ప్రస్తావించింది ఈ సంస్థ. రాజకీయ, ఆర్థిక అస్థిరతలే వలసలకు ప్రధాన కారణం అని పేర్కొంది. 2022లో 117 మిలియన్ల ప్రజలు స్థానభ్రంశం చెందారని వెల్లడించింది. 2020తో పోలిస్తే శరణార్థుల సంఖ్య 30 శాతం పెరిగింది. భారత్‌లో అంతర్గత వలసలు ఎక్కువగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి ఉన్నాయి.

### హంబోల్ట్



- వెనెజులాలోని హంబోల్ట్ హిమాని నదం కరిగిపోయింది. అసలు హిమాని నదం అని పిలిచే స్థాయి కూడా లేదని ఇంటర్నేషనల్ క్రైయోస్ఫియర్ క్లైమేట్ ఇనిషియేటివ్ అనే పరిశోధన సంస్థ గుర్తించింది. ఇది వెనెజులాలో ఉంది. 2011లోనే ఇక్కడే ఉన్న ఐదు హిమాని నదాలు పూర్తిగా కరిగాయి.

### ఉక్రెయిన్

- జైలులో శిక్షను అనుభవిస్తున్న వాళ్లు, స్వచ్ఛందంగా సైన్యంలో చేరేందుకు ఆసక్తి చూపిస్తే అనుమతించాలని ఉక్రెయిన్ దేశం చట్టం చేసింది. రష్యాతో యుద్ధం కొనసాగుతుండటంతో సైన్యం అవసరాలు ఏర్పడటంతో ఈ మేరకు ఆ దేశం నిర్ణయించింది. అత్యాచారంతో పాటు హత్యలకు పాల్పడి శిక్షను అనుభవిస్తున్న వారికి ఇది వర్తించదు.

## క్రీడలు

### శ్యామ్ నిఖిల్

- 85వ గ్రాండ్‌మాస్టర్‌గా శ్యామ్ నిఖిల్ నిలిచాడు. ఆయన తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారు.

### బజరంగ్ పునియా

- భారత రెజ్లర్ బజరంగ్ పునియాను ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు సస్పెండ్ చేస్తూ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ సమాఖ్య నిర్ణయం తీసుకుంది. డోపింగ్‌కు సంబంధించి నమూనాను ఇచ్చేందుకు ఆయన నిరాకరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### అజ్లాన్ షా హాకీ

- సుల్తాన్ అజ్లాన్ షా హాకీ ట్రోఫీని జపాన్ గెలుచుకుంది. తుదిపోరులో పాకిస్థాన్‌ను ఓడించింది. ఈ టోర్నీ మలేషియాలో నిర్వహించారు. దీన్ని గెలవడం జపాన్‌కు ఇదే తొలిసారి.




## వార్తల్లో వ్యక్తులు

### కామిరీటా



- నేపాల్‌కు చెందిన పర్వతారోహకుడు కామిరీటా 29వ సారి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. 1992లో తొలిసారి ఆయన ఈ పర్వతాన్ని అధిరోహించారు.

### సంజయ్ భల్లా

- భారత నావికా దళానికి చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా సంజయ్ భల్లా మే 10న బాధ్యతలు స్వీకరించారు.

### దిలీప్ సంఘాని

- భారత రైతుల ఎరువుల సమాఖ్యకు చైర్మన్‌గా దిలీప్ సంఘాని ఎన్నికయ్యారు. ఈ పదవిని ఆయన చేపట్టడం ఇది రెండోసారి. ఈ సంస్థను 1967, నవంబర్ 3న ఏర్పాటు చేశారు. ప్రధాన కేంద్రం ఢిల్లీలో ఉంది. ఇది బహుళ రాష్ట్రాల సమాఖ్య వ్యవస్థ.

### డేవిడ్ సాల్వాగ్నినీ

- నాసాకు సంబంధించిన కృత్రిమ మేధ ముఖ్య అధికారిగా డేవిడ్ సాల్వాగ్నినీ నియమితులయ్యారు. ఇప్పటికే ఆయన చీఫ్ డేటా ఆఫీసర్‌గా ఉన్నారు. తాజాగా ఆయనకు అదనపు విధులు దక్కాయి.

### సౌమ్య స్వామినాథన్



- ప్రజారోగ్యానికి సంబంధించి సేవ చేస్తున్న ప్రపంచంలో పది అత్యుత్తమ వ్యక్తులను కెనడాకు చెందిన మెక్ గిల్ యూనివర్సిటీ గుర్తించింది. అందులో భారత్‌కు చెందిన సౌమ్య స్వామినాథన్ కూడా ఉన్నారు. ట్యూబర్‌క్యులోసిస్, హెచ్‌ఐవీలను అరికట్టేందుకు ఆమె పరిశోధన చేశారు. జెనీవా కేంద్రంగా పనిచేసే ప్రపంచ ఆరోగ్య సంస్థకు తొలి చీఫ్ సైంటిస్ట్‌గా పనిచేశారు. 2019 నుంచి 2022 వరకు ఈ పదవిలో ఆమె కొనసాగారు. అలాగే 2017 నుంచి 2019 వరకు ఆమె ప్రపంచ ఆరోగ్య సంస్థలోనే డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రోగామ్స్ అనే హోదాలో పనిచేశారు. భారతరత్న డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ కుమార్తె ఆమె.

### రస్కిన్ బాండ్

- భారత సాహిత్య చరిత్రలో అత్యున్నత పురస్కారంగా భావించే సాహిత్య అకాడమీ ఫెలోషిప్‌ను ప్రముఖ రచయిత రస్కిన్ బాండ్‌కు ప్రకటించారు.

### ఇడాశిషా నాంగ్‌రంగ్



- మేఘాలయ డీజీపీగా ఇడాశిషా నాంగ్‌రంగ్ నియమితులయ్యారు. ఆ రాష్ట్రంలో ఈమె తొలి మహిళా డీజీపీ. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆమె.

### ఇడ్రిస్ డెబి

- చాద్‌లో ప్రస్తుత సైనిక పాలకుడిగా ఉన్న ఇడ్రిస్ డెబి ఎన్నికల్లో ఆ దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

### పవన్ సింధి

- సామాజిక సేవ చేసినందుకు గ్లోబల్ ప్రైడ్ ఆఫ్ సింధి అవార్డును 2024కు పవన్ సింధికి లభించింది.

### ఉదయ్ నాగరాజు



- యూకే పార్లమెంట్ ఎన్నికల్లో ఉదయ్ నాగరాజు పోటీ చేస్తున్నారు. లేబర్ పార్టీ తరఫున ఆయన బరిలో దిగుతున్నారు. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా కొహెడ మండలంలోని శనిగరం గ్రామానికి చెందినవారు.

### కొలిశెట్టి రామదాస్

- తెలంగాణ తొలి దశ పోరాటంలో కీలక పాత్ర పోషించిన కొలిశెట్టి రామదాస్ మరణించారు. ఆయన స్వస్థలం ఖమ్మం జిల్లా ఇల్లెందు సమీపంలోని కారేపల్లి. నాన్ ముల్కీ గోబ్యాక్ నినాదంతో ఖమ్మం ప్రభుత్వ విద్యార్థులు చేపట్టిన ఉద్యమంలో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. 1968లో తెలంగాణ ప్రాంతీయ సమితిని స్థాపించారు.

## రోజులు

### మే 16

- ఏటా మే 16న అంతర్జాతీయ శాంతియుత జీవన రోజుగా నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి, సహనం దేశాల మధ్య, వ్యక్తుల మధ్య పెంపొందించేందుకు ఉద్దేశించి ఈ రోజును ఒక తీర్మానం ద్వారా ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ ఏర్పాటు చేసింది. అలాగే ఇదే రోజున ప్రతి సంవత్సరం అంతర్జాతీయ కాంతి రోజుగా కూడా పరిగణిస్తారు. థియోడోర్ మైమన్ 1960లో లేజర్‌పై విజయవంతంగా ఇదే రోజున పరీక్షను నిర్వహించారు. అలాగే కాంతిపై అందరికీ అవగాహన కల్పించేందుకు ఈ రోజు ఉద్దేశించింది. 2016 నుంచి యునెస్కో ఈ వేడుకను నిర్వహిస్తుంది.

### మే 12




- ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల రోజుగా నిర్వహిస్తారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్నారు. ఇదే రోజున వృక్ష ఆరోగ్యపు అంతర్జాతీయ రోజుగా కూడా నిర్వహిస్తారు.

### మే 11

- ఏటా మే 11న జాతీయ సాంకేతిక రోజుగా నిర్వహిస్తారు. శాస్త్రవేత్తలు చేస్తున్న సేవను గుర్తించేందుకు ఉద్దేశించిన రోజు ఇది. 1998, మే 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించినందుకు ఈ రోజును సాంకేతిక రోజుగా నిర్వహించాలని నిర్ణయించారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

